క్లుప్తంగా

కాటమకుంటలో మాజీ ఎమ్మెల్యే పర్యటన



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డితో కాటమకుంట గ్రామస్తులు

బత్తలపల్లి: మండలంలోని కాటమకుంట గ్రామంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదివారం పర్యటించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించడంతోపాటు సమస్యలపై ఆరా తీశారు. అనంతరం పార్టీ నేత దొడ్డావుల బయపరెడ్డి ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాలకు చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందనితహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే వినతి పత్రాలను అందజేయవచ్చన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్యామ్‌రావ్

తాడిమర్రి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావ్ రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అలాగే మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకూడదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సూర్యనారాయణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వసతి గృహం అధికారి శంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 3వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8008633290, 8919254720 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సింగర్ మంగ్లీపై కుట్రలు ఆపండి

ధర్మవరం రూరల్: సింగర్ మంగ్లీపై కుట్రలను ఆపాలని ధర్మవరం బీఎస్పీ ఇంచార్జ్ సాకే వినయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల తెలంగాణాలో జరిగిన వ్యక్తిగత విందు కార్యక్రమాన్ని రాజకీయం చేసి మంగ్లీపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలే మద్యం వ్యాపారాన్ని నిర్వహిస్తూ, పబ్బులు, బార్లకు లైసెన్సులు ఇస్తూ ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నాయని ఆరోపించారు. మంగ్లీకి గిరిజన దళిత, బలహీన వర్గాల ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు, మీడియా అండగా నిలవాలని కోరారు.

టెట్రా ప్యాకెట్లు స్వాధీనం

హిందూపురం టౌన్: హిందూపురం ఎక్సైజ్ పోలీసులు రహమత్‌పురం, ముదిరెడ్డిపల్లి సమీపంలో ఆదివారం దాడులు నిర్వహించి టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. కర్ణాటక మద్యం 154 టెట్రా ప్యాకెట్లు, 15 లీటర్ల విస్కీ ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని షేక్ అంజాద్, రాజగోపాల్, లక్ష్మన్నలపై ముగ్గురిపై కేసులు నమోదు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. అలాగే హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముదిరెడ్డిపల్లి వద్ద మద్యం బెల్టు దుకాణం నిర్వహిస్తున్నారన్న స్థానికుల ఫిర్యాదు మేరకు తనిఖీలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు పృథ్వీ, ఫరూక్, నారాయణస్వామి, హెచ్‌సీలు నరసింహ, వెంకటేష్, రమణ, సతీష్, కానిస్టేబుళ్లు అంజి, సురేష్, రవీంద్ర, కుమార్, రంగదామా, శివ, సుధాకర్ రెడ్డి, ఉష్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

సేవకు దూరం.. రైతుకు శాపం

- రేషనలైజేషన్ పేరుతో రైతు సేవా కేంద్రాల కుదింపు
- సిబ్బందిని ఇతర శాఖలకు పంపేందుకు చర్యలు
- ఆర్‌ఎస్‌కేలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు
- ఇప్పటికే దూరమవుతున్న సేవలు

వివరాలు..	
మండలం	రైతు సేవా కేంద్రాలు
రాప్తాడు	13
ఆత్మకూరు	10
అనంతపురం రూరల్	17
రామగిరి	11
చెన్నేకొత్తపల్లి	13
కనగానపల్లి	10



రాప్తాడు మండలం హంపాపురంలోని రైతు సేవా కేంద్రం

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ హయాంలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) కూటమి ప్రభుత్వ తీరుతో త్వరలో కనుమరుగు కానున్నాయి. ఉన్న ఊళ్లోనే రైతులకు అన్ని రకాల సేవలు అందించాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వీటిని ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పంటల సాగుకు అవసరమైన అన్ని రకాలు సేవలు అన్నదాలతకు సకాలంలో అందేవి. పంటల సాగులో సూచనలు, సలహాలు, అందించడంతో పాటు విత్తనాలు, ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకునేవారు. పండిన పంటలకు కూడా గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేవారు. తద్వారా రైతులకు ఎంతో మేలు జరిగేది. ఇటీవల కాలంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చి.. ఈ వ్యవస్థనే నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతోంది. రేషనలైజేషన్ పేరుతో కేంద్రాలను కుదించేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఉన్న సిబ్బందిని సర్దుబాటు పేరుతో ఇతర సంస్థలకు బదలాయించేందుకు చర్యలు తీసుకుంటోంది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో రైతులు ఇబ్బందులు పడతారు.

సేవలకు బ్రేక్..

కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సాగుకు అవసరమైన రాయితీ విత్తనాల పంపిణీ ఆగిపోయింది. సబ్సిడీపై ఎరువులను నామమాత్రంగా అందించారు. అది కూడా రైతు సేవా కేంద్రాల ద్వారా కాకుండా సహకార సంఘాల ద్వారా విక్రయాలను చేపట్టారు. ఈ ఏడాది సాగులో చివరిలో యూరియా అందక రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. తాజాగా రేషనలైజేషన్ పేరుతో రెండు వేల ఎకరాలు సాగులో ఉండే గ్రామాల్లో మాత్రమే రైతు సేవా కేంద్రాలు కొనసాగించాలని నిర్ణయించి కుదింపు అమలుకు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు నివేదికలు సిద్ధం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే నియోజకవర్గంలో చాలా రైతు సేవా కేంద్రాలు తగ్గిపోనున్నాయి. రాప్తాడులో 13, ఆత్మకూరులో 10, అనంతపురం రూరల్‌లో 17, కనగానపల్లిలో 10, రామగిరిలో 11, చెన్నేకొత్తపల్లిలో 13 కలిపి మొత్తం 74 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 74 మంది వీఏఏలుగా విధులు నిర్వహిస్తున్నారు. రేషనలైజేషన్ పేరుతో ఇందులో సగం మందిని ఇతర శాఖలకు పంపించేస్తే మిగిలిన సిబ్బందితో రైతులకు సేవలు అందించడం కష్టంగా మారనుంది.

ఐదేళ్లూ ఇబ్బంది పడలేదు



వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయం పండగలా మరింది. గ్రామాల్లోనే ఆర్‌బీకేలు ఏర్పాటు చేయడం ద్వారా విత్తనం దగ్గర నుంచి ఎరువుల వరకు అన్నీ అందుబాటులో లభించేవి. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి స్థానికంగానే కొనుగోలు చేసేవారు. ఈ ఐదేళ్లు మాకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. అన్నదాతకు అండగా నిలిచిన రైతు సేవా కేంద్రాలను కుదిస్తే వ్యవసాయం దండగ అనే భావన మళ్లీ కలుగుతుంది. రైతు సేవా కేంద్రాలను కూటమి ప్రభుత్వం కొనసాగించి అన్నదాతను ఆదుకోవాలి.

– తలారి సింగారప్ప, హంపాపురం, రాప్తాడు మండలం

సేవలు ఊళ్లోనే అందేవి



గతంలో రైతు భరోసా కేంద్రాల వల్ల ప్రయోజనం పొందాం. విత్తనాలు, ఎరువులు, సాగుకు అవసరమైన అన్ని సేవలు ఊళ్లోనే అందేవి. వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా అందుబాటులో ఉండి పంటలకు ఏమైనా తెగుళ్లు, పురుగు ఆశించిందని చెప్పిన వెంటనే పొలానికి వచ్చి చూసేవారు. అలాంటి కేంద్రాలను తగ్గించడం సరికాదు. ఇప్పుడు పురుగు మందులు, విత్తనాలు కొనుక్కోవాలంటే దుకాణాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. విత్తనాల నాణ్యత తెలుసుకోవడం కష్టంగా మారుతుంది.

– నారప రెడ్డి, పుల్లలరేవు, రాప్తాడు మండలం

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి

కదిరి టౌన్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కదిరిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డితో కలిసి రమేష్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఒక్క 'తల్లికి వందనం' ఇచ్చి.. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేసినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. తల్లికి వందనం పథకంలో కూడా అనేక షరతులు పెట్టి అర్హత ఉన్నా కొంతమంది తల్లులకు డబ్బు జమ చేయలేదన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్నదాతా సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం, 50 సంవత్సరాలు నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పింఛన్, 19 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500, ఇంటికో ఉద్యోగం.. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు ఇస్తామని ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఏవైతే హామీలు ఇచ్చారో అవన్నీ అమలు చేసి మాట్లాడాలని కూటమి ప్రజాప్రతినిధులకు హితవు పలికారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలే కాకుండా అదనంగా మరిన్ని పథకాలు అమలు చేసి చూపించారని గుర్తు చేశారు. హామీలు అమలుపై ఎవరైనా ప్రశ్నించినా, వ్యతిరేకంగా మాట్లాడినా కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం, అరెస్టులు చేయడం చేస్తోందని మండిపడ్డారు. ఇటువంటి కేసులు-బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. టీడీపీ అరాచకాలు ఆపకపోతే పరిణామాలు మరోలా ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలు అమలు చేసి.. రాష్ట్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు.

అక్రమ అరెస్టులు హేయం

గాండ్లపెంట మండలం గొడ్డువెలగల రోడ్డులో టీడీపీ వారు వేసిన శిలాఫలకం ధ్వంసం కేసులో మాజీ ఎంపీపీ జగన్‌మోహన్‌ను అక్రమంగా అరెస్టు చేసి కదిరి రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డితో పాటు నాయకులు ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం కేసు వివరాల గురించి సీఐ నాగేంద్రను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే కేసుల పెట్టడం హేయమైన చర్య అని ఖండించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, కన్వీనర్లు రవికుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, ఫయాజ్, రంగారెడ్డి, మణికంఠ నాయక్, కౌన్సిలర్ రామ్‌ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రియురాలి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఎస్పీ రత్న



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ప్రియురాలి హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కేసు వివరాలను ఎస్పీ రత్న వెల్లడించారు. గాండ్లపెంట మండలం సాదులవాండ్లపల్లికి చెందిన ఆంజినేయులు, సరస్వతి (35) దంపతులు. భర్తతో విభేదాలు రావడంతో ఆమె తన ఇద్దరు కుమారులను తీసుకుని ఎనిమిదేళ్ల కిందట తలుపులకు వచ్చేసింది. బలిజపేటలో నివాసముంటూ కూలి పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో స్థానికంగా ఉండే బేల్దారి సికిందర్‌తో పరిచయం ఏర్పడింది. అదికాస్తా వారిద్దరి మధ్య సహజీవనానికి దారితీసింది. అయితే ఆమె ఇటీవల మరొకరితో చనువుగా మాట్లాడుతోందని అనుమానం పెంచుకున్న సికిందర్ పలుమార్లు గొడవపడ్డాడు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య సఖ్యత చెడింది. ఏప్రిల్ 22న పిల్లలు కదిరిలో ఫంక్షన్‌కు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన సికిందర్ ఇంట్లో ఒంటరిగా ఉన్న సరస్వతితో మరోమారు గొడవపడి.. నైలాన్ దారంతో గొంతుకు బిగించి ఊపిరాడకుండా చంపేశాడు. అదే రోజు మధ్యాహ్నం ద్విచక్రవాహనంలో తలుపుల గండి రోడ్డు సమీపంలో గల జమ్ముగడ్డ వంక గడ్డ కింద పూడ్చేసి, రాళ్లు పేర్చేశాడు. తనపై అనుమానం రాకుండా ఉండేందుకు సరస్వతి ఇంటికి యథావిధిగా రాకపోకలు సాగించేవాడు. నెలన్నర దాటినా తల్లి జాడ కనిపించకపోవడంతో పెద్దకుమారుడు తలుపుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. విషయం తెలుసుకున్న సికిందర్ తలుపుల పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. హత్యకు సంబంధించిన పరికరాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలియజేశారు.

శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోండి

మహిళలు,బాలికలపట్ల అఘాయిత్యాలకు, ఒంటరి మహిళల పట్ల జరిగే నేరాలకు అడ్డుకట్ట వేయడానికి శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్పీ సూచించారు. శక్తి యాప్ 7993485111 వాట్సాప్ నంబర్ కు పిర్యాదు చేయవచ్చునన్నారు. పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, తలుపుల ఎస్ఐ నరసింహులు ఉన్నారు.

అందని బీమా.. కనిపించని ధీమా!

తాడిమర్రి మండల కేంద్రం ఎస్సీ కాలనీలో నాలుగు నెలల క్రితం 30 ఏళ్ల యువకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి బీమా అందించాలని వారి కుటుంబ సభ్యులు సచివాలయ సిబ్బందిని అడగ్గా ప్రస్తుతం అలాంటి పథకం ఏదీ లేదని చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎటువంటి ఆధారం లేని బాధిత మహిళల ఇద్దరు చిన్నారులను పోషించు కోవడానికి తీవ్ర అవస్థలు పడుతోంది.

తాడిమర్రి ఎస్సీ కాలనీకి చెందిన 45 ఏళ్ల వయసు మహిళ ఆరు నెలల క్రితం మృతి చెందింది. అమె కుటుంబానికి కూడా బీమా అందక కుటుంబ సభ్యులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇది ఆమె పరిస్థితే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలు
- ఏడాదైనా పట్టించుకోని కూటమి ప్రభుత్వం

తాడిమర్రి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి మృతుల కుటుంబాలకు బీమా పంపిణీ ఆగిపోయింది. బీమా అందక మృతుల కుటుంబీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో గత వైఎస్సార్ ప్రభుత్వంలో మృతుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం త్వరితగతిన అందేది. అంతేకాకుండా కుటుంబంలో భార్య, భర్తలు ఎవరు మృతి చెందినా తక్షణ సాయంగా అంత్యక్రియల కోసం (మట్టి పనికి) ప్రభుత్వం గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా బాధిత కుటుంబాలకు పరిహారం అందించేవారు.

రూ.15కే బీమా..

మహిళా స్వయం సహాయ సంఘాల్లో మహిళలతో కేవలం రూ.15లకే బీమా పాలసీ చేయించుకుని బీమా అందించేవారు. కుటుంబంలో 60 ఏళ్ల వయసులోపు భార్య లేదా భర్త ఎవరు మృతి చెందిన ప్రభుత్వం బీమా అందించేది. 50 ఏళ్ల వయసు నుంచి 60 ఏళ్ల వయసు వరకు సాధారణ మృతి (అనారోగ్యంతో) చెందితే రూ.30 వేలు, పాముకాటు, విద్యుత్ ప్రమాదం, రోడ్డు ప్రమాదం తదితర ప్రమాదకరంగా మృతి చెందితే రూ.2 లక్షలు అందించేవారు. అంత్యక్రియల్లో అందించిన మొత్తం రూ.15 వేలు పోగా మిగిలిన మొత్తాన్ని బాధితులకు అందించేవారు. అలాగే 50 ఏళ్లలోపు భార్య, భర్తలు మృతి చెందితే సాధారణ మరణం అయితే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తూ అయితే రూ.5 లక్షలు అందించేవారు. ఈ మొత్తం కూడా మట్టిఖర్చులకు ఇచ్చిన మొత్తం రూ.15 వేలు పోగా మిగిలిన మొత్తం బాధిత కుటుంబ సభ్యులకు అందేది. ఈ బీమా బాధిత కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలిచేది.

బీమాకు మంగళం

గతేడాది జూన్ మాసంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం బీమా పంపిణీకి మంగళం పలికింది. దీంతో బీమా అందక ఎన్నో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతేడాది నుంచి మండలంలో 60 ఏళ్ల లోపు వయసు వారు దాదాపు 25 మంది మృతి చెందారు. అయితే ఎవ్వరికి అంత్యక్రియల కోసం తక్షణ సాయం రూ.15 వేలు కాని, మిగిలిన మొత్తం కాని అందలేదు. దీంతో బాధిత కుటుంబీకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

పేదలకు తీవ్ర అన్యాయం



మృతుల కుటుంబాలకు బీమా అందక పోవడం తీవ్ర అన్యాయం. గత ప్రభుత్వంలో 60 ఏళ్ల వయసులోపు మృతుల కుటుంబాలకు తక్షణ సాయంగా (మట్టి ఖర్చులకు) రూ.15 వేలు ఇస్తుండేవారు. దీంతో పేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలిచేది. తర్వాత సాధారణ మరణం అయితే రూ.2 లక్షలు, ప్రమాద మరణం అయితూ రూ.5 లక్షలు వచ్చేది. దీంతో బాధిత కుటుంబాలకు ఆసరాగా నిలిచేది. ఈ ప్రభుత్వం బీమా ఇవ్వకపోవడంతో బాధిత కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయి.

–లక్ష్మీనారాయణ, వ్యవసాయ, కార్మిక సంఘం మండల అధ్యక్షులు, తాడిమర్రి

బీమా నిలిపివేత బాధాకరం



గత ప్రభుత్వంలో మృతుల కుటుంబాలకు ఇచ్చే బీమాను కూటమి ప్రభుత్వం నిలిపి వేయడం బాధాకరం. కుటుంబంలో పెద్దదిక్కు అయిన భర్త మృతి చెందితే ఆ కుటుంబంలో భార్యా, పిల్లలు వీధిన పడతారు. కుటుంబాన్ని పోషించే యజమాని లేక పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుంది. గత ప్రభుత్వంలో మాదిరిగానే ఈ ప్రభుత్వం బీమా ఇవ్వాలి.

–పార్నపల్లి నారాయణ, సీఐటీయూ మండల కన్వీనర్, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి

ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి

బత్తలపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పోట్లమర్రి, గంటాపురంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలతో గద్దెనెక్కి సంవత్సరం గడుస్తున్నా ఎలాంటి హామీలను నెరవేర్చలేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మాల్యవంతం కుళ్లాయప్ప, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వడ్డె సన్నపెద్దన్న, బత్తల నాగభూషణ, నాయకులు సత్యమయ్య, సత్యప్ప, ఓబులేసు, నారాయణ, నాగరాజు, రామాంజనేయులు, తాడిమర్రి మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పోట్లమర్రి గ్రామస్తులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

సర్టిఫికెట్లు ఇప్పించాలి

చెన్నేకొత్తపల్లి: విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లను తమ తల్లిదండ్రుల నుంచి ఇప్పించాలని అఖిల, నరేంద్ర దంపతులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. వివరాలు.. గుత్తికి చెందిన అఖిల, చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన నరేంద్ర పుట్టుకతోనే మూగ, చెవిటి వారు. వీరు ఆర్డీటీ సంస్థ సహకారంతో బుక్కరాయసముద్రంలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. ప్రేమ వివాహం అనంతరం ఇద్దరు బెంగళూరులో ప్రైవేట్ జాబ్ చేసుకుంటున్నారు. అఖిల కులాంతర వివాహం చేసుకుందనే కారణంలో బంధువులు ఇద్దరి విద్యార్హత సర్టిఫికెట్లను తీసుకెళ్లారు. అధికారులు స్పందించి సర్టిఫికెట్లు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అఖిల, నరేంద్ర దంపతులు కోరుతున్నారు.

మాజీ ఎంపీపీపై కేసు నమోదు

గాండ్లపెంట: మండలంలోని వీరన్నగట్టపల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని గొడ్డువెలగల ఎంపీటీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ తాతమ్ జగన్మోహన్, నీరుకుంట్లపల్లికి చెందిన బాబాపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ ఆదివారం తెలిపారు. ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో చేనేత కార్మికుడికి తీవ్రగాయాలు



నరేష్

ధర్మవరం రూరల్: పట్టణంలోని గూడ్స్‌షెడ్డు కొట్టాలకు చెందిన చేనేత కార్మికుడు నరేష్ ఆదివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు..నరేష్ తన బైక్‌పై మేడాపురం గ్రామానికి వెళ్లి ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో పట్టణంలోని గాంధీ నగర్ చౌడమ్మ గుడి వద్ద ఆగి ఉన్న పాల వ్యానును వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తల వెనుక భాగాన తీవ్ర గాయమైంది. వెంటనే అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తీసుకెళ్లారు.


అరణ్యం నుంచి జనారణ్యంలోకి..



గోడపై మయూరం

పుట్టపర్తి అర్బన్: అటవీ ప్రాంతాలు తగ్గిపోవడంతో వన్యప్రాణులు జనావాసాల్లోకి చొరబడుతున్నాయి. ఈక్రమంలో ఆదివారం రెండు నెమళ్లు పుట్టపర్తి మండలం పెడపల్లిలో వీధుల్లో విహరించింది. ఈ దృశ్యాన్ని చిన్నారులు ఆసక్తిగా తిలకించారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు



అలంకరణలో సిద్ధేశ్వర స్వామి

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి భక్తులు తెచ్చిన పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు ప్రసాద వినియోగం చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారి మూల ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. విశేష పూజ రోజు కావడంతో స్వామివారిని కొలిచే గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.